



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, జూలై 11, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-





స్థానిక ఎన్నికల్లో

# బీసీలకు 42% కోటా

**పంచాయతీరాజ్ చట్ట సవరణకు త్వరలో ఆర్డినెన్స్.. సీఎం అధ్యక్షతన జరిగిన భేటీలో కేబినెట్ కీలక నిర్ణయాలు**

**వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, వాకిటి.. త్వరలో 22,033 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు**

**అమిటీ, సెయింట్ మేరీస్ విద్యా సంస్థలకు వర్సిటీ హోదా.. పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సత్వరమే పూర్తి**

**మత్స్యశాఖ బడ్జెట్ రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంపు.. గోశాలల ఏర్పాటు,నిర్వహణపై సీఎస్ నేతృత్వంలో కమిటీ**

**'ఆధార్'తో ఔట్ సోర్సింగ్,కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరుపై సమీక్ష**

హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టం–2018 సవరణకు త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీతో పాటు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించిన విషయం గుర్తు చేశారు. సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ పలువురు కేంద్రమంత్రులు, సంబంధిత అధికారులతో దీనిపై అనేకసార్లు చర్చించినా కొర్రీలు వేస్తూ కాలయాపన చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ భేటీకి అడ్వొకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి ఆయన సలహాలు తీసుకుని, న్యాయపరమైన చిక్కులు రాకుండా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలకు ఇబ్బందులు ఎదురవకుండా రాజకీయ పార్టీలు కూడా చిత్తశుద్ధితో సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి ఇప్పటికే రాష్ట్రంలో 62 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, రిజర్వేషన్లపై 50 శాతం క్యాప్ నిబంధన దేశంలో ఎప్పుడో పోయిందని అన్నారు.

**కేబినెట్ నిర్ణయాలు 96% అమలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దీనికి ముందు వరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో 327 అంశాలపై చర్చించి 321 అంశాలపై నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి పొంగులేటి

(మిగతా 2వ పేజీలో)

# 44కు చేరిన కల్తీ కల్లు బాధితులు

- నిమ్స్‌లో కోలుకున్న 27 మంది
- నలుగురికి ఇంకా కొనసాగుతున్న డయాలసిస్
- నిమ్స్‌లో బాధితులను పరామర్శించిన మంత్రి దామోదర
- కల్లులో నెఫ్రోటాక్సిక్స్ కలవటం వల్లే ప్రమాదం
- బాధితుల రక్తంలో భారీగా సీరం క్రియాటినైన్: వైద్యులు
- ఘటనపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కు పెరిగింది. కల్తీ కల్లు తాగి ఇప్పటికే ఆరుగురు మరణించిన విషయం తెలిసిందే. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మీడియాతో మాట్లాడుతూ.. నిమ్స్‌లో 31 మంది

(మిగతా 2వ పేజీలో)

# 'ఫీజు'లపై జూన్‌లోగా నిర్ణయం తీసుకోలేరా?

**ఏటా ఇదో ప్రహసనంలా మారిందంటూ హైకోర్టు వ్యాఖ్య**

**ఫీజు పెంపు కోరుతూ ఇంజనీరింగ్ కాలేజీల పిటిషన్లపై విచారణ**

**టీఏఎఫ్ఆర్సీ తీరుపై అసంతృప్తి..**

**నేడు మధ్యంతర ఉత్తర్వులిస్తామని వెల్లడి**



హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై జూన్‌లోగా నిర్ణయం తీసుకోలేరా? అని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ)పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏటా ఫీజుల అంశం ఓ ప్రహసనంలా మారిందని.. కౌన్సెలింగ్ ముగిసి తరగతులు మొదలయ్యే వరకు తేల్చకుండా కమిటీ వ్యవహరిస్తోందని విమర్శించింది. సీట్లు, ఫీజులు.. ఇలా ఏదో ఒక కారణంతో ఏటా కాలేజీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం సర్వసాధారణంగా మారిందని వ్యాఖ్యానించింది. నెలలుగా జరుగుతున్న అంశంలో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్లు వేయడంపై కాలేజీల తీరును తప్పుబట్టింది. ఫీజుల పెంపుపై శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పింది. ఫీజుల పెంపునకు ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ 2024 డిసెంబర్‌లోనే ఇంజనీరింగ్ కళాశాలలు ప్రతిపాదనలు సమర్పించాయన్నారు. మార్చిలో భేటీ అయిన కమిటీ ఆ ప్రతిపాదనలకు అంగీకరించిందని చెప్పారు. దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే సాక్ష్యమన్నారు. దీంతో రిజిస్టర్‌ను వెంటనే కోర్టు ముందు ఉంచాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. అనంతరం టీఏఎఫ్ఆర్సీ తరఫు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ కాలేజీలు లాభాపేక్షతో పనిచేయరాదంటూ సుప్రీంకోర్టు గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. కాలేజీల ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవడానికి

(మిగతా 2వ పేజీలో)



## ఐదేళ్లలో వెయ్యి కొత్త రైళ్లు.. 2027 నాటికి బుల్లెట్ రైలు



## ఉత్తర భారతంలో భూకంపం



## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల కేసులో రంగంలోకి ఇడి

హైదరాబాద్ : బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల కేసులో ఇడి రంగంలోకి దిగింది. బెట్టిం గ్ యాప్స్ ప్రమోషన్లకు పాల్పడిన సినిమా, టీవీ సెలబ్రిటీలపై ఇడి చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు 29 మంది సెలబ్రిటీలతో పాటు వారు ప్ర మోట్ చేసిన కంపెనీలపై కేసులు నమోదు చేసిం ది. వీరిలో సినీ నటులు విజయ్ దేవరకొండ, రా నా, మంచు లక్ష్మి, ప్రకాశ్‌రాజ్ , నిధి అగర్వాల్ , అనన్య నాగళ్ల, శ్రీముఖితో పాటు పలువురిపై సైబరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి వి చారణ జరపనుంది. సినీ సెలబ్రిటీలు, యూ ట్యూ బర్స్ , ఇన్ ఫ్లూయెన్సర్లను మనీ ల్యాడరింగ్ నేరం కింద విచారించనుంది. ఈ సెలబ్రిటీలు భారీ మొ త్తంలో పారితోషికాలు తీసుకుని, నిషేధిత బెట్టిం గ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారన్నది ఆ రోపణ. వీరి ప్రచారం కారణంగా ఎంతోమంది యువత

(మిగతా 2వ పేజీలో)

## మా చరిత్రను తొలగిస్తే ఇక మేమెవరం?

**::: ప్రధాని మోదీకి కేటీఆర్ ట్వీట్**



హైదరాబాద్: భారతదేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించడం ఏంటని ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణమన్నారు కేటీఆర్. ఇలా తమ చరిత్రను తొలగిస్తే ఇక మేమెవరం? అని నేరుగా ప్రధాని మోదీకే

(మిగతా 2వ పేజీలో)



## ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఝలక్!

హైదరాబాద్: తెలంగాణలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సిట్ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి వెళ్లారు. అయితే, గతంలో ప్రభాకర్ రావును అరెస్ట్ చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మినహాయింపులు రద్దు చేయాలని సుప్రీంకోర్టును సిట్ అధికారులు కోరనున్నారు. ప్రభాకర్ రావు విచారణకు సహకరించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభాకర్ రావును కస్టడీకి తీసుకోవాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా..

(మిగతా 2వ పేజీలో)




## లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్‌లో
# గురు పౌర్ణమి వేడుకలు

బాలాపూర్, వార్త మిర్రర్ : బడంగ్ పేట్ లోని లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్ లో " గురు పౌర్ణమి " వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. పాఠశాల లోని విద్యార్థులు తమ గురువులను పూజించి, సత్కరించి వారి నుండి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాభారతం రచన తో ప్రపంచానికి గురువైన వేద వ్యాసుని పుట్టినరోజు ను గురు పౌర్ణమి గా జరుపకుంటామని, గురువులను పూజించే సంస్కారం కేవలం భారతదేశంలోనే ఉందని, అలాంటి గురువులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని, సంబరాలు జరిపి, పాఠశాల ప్రాంగాణమంతా కోలాహలం నింపారు.

## 44కు చేరిన కల్తీ కల్లు బాధితులు

చికిత్స పొందుతున్నారని, వీరిలో 27 మంది కోలుకున్నట్లు తెలిపారు. వీరిని శుక్రవారం నుంచి దశలవారీగా డిశ్చార్జి చేస్తారని వెల్లడించారు. నాలుగైదు రోజుల్లో అందరూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. నలుగురు బాధితులకు డయాలసిస్ కొనసాగుతోందని తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారని, మరో ఏడుగురు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరినట్లు వివరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. మంత్రి వెంట నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ, ఏఎంఎస్ డా.చరణ్‌రాజ్ తదితరులు ఉన్నారు. కల్లులో నెఫ్రోటాక్సిక్స్ (కొన్ని ఔషధాలు, ఇతర కెమికల్స్ కలి సి కిడ్నీలపై చెడు ప్రభావం చూపటం) కలవటం వల్లనే అది తాగినవారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. బాధితుల రక్తంలో సీరం క్రియాటినైన్ భారీగా పెరగడంలో వారి కిడ్నీల పనితీరుపై ప్రభావం పడిందని నిమ్స్ వైద్యు లు వెల్లడించారు. సాధారణంగా కల్లులో మత్తు కోసం డైజోఫాం, క్లోరోహైడ్రేట్, తీపి కోసం శాక్రిన్, నురగ కోసం అమ్మోనియం లాంటివి కలుపుతుంటారు. ఈ కల్లులో నెఫ్రోటాక్సిక్స్ కలవటం వల్లే ఎక్కువ మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొందరు మరణించారు. కండరాలపై శ్రమ పెరిగినప్పుడు శరీరంలో ఉత్పత్తి అయ్యే క్రియాటినైన్‌ను మూత్రపిండాలు రక్తం నుంచి శుద్ధి చేసి బయటకు పంపిస్తాయి. కానీ, ఈ క్రియాటి నైన్ అసాధారణంగా పెరిగిపోయినప్పుడు కిడ్నీలే దెబ్బతింటాయి. అప్పుడు ఈ వ్యర్థ పదార్థం గుండె, మెదడుతోపాటు ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందని నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్‌రాజ్ వివరించారు. అలాంటి సమయంలో వెంటనే డయాలసిస్ చేయకపోతే వ్యక్తి మరణించే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

**సమగ్ర నివేదిక ఇవ్వండి: మానవ హక్కుల కమిషన్**

కల్తీ కల్లు సేవించి ఆరుగురు మృతి చెందిన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై 20వ తేదీలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రొ హిబిషన్, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించింది. న్యాయవాది ఇమ్మనేని రామరావుతో పాటు పలువురు ఫిర్యాదు చేయటంతో ఈ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిషో ర్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారణ చేపట్టి పోలీసులకు పలు ఆదేశాలిచ్చింది.

## ఉత్తర భారతంలో భూకంపం

ఢిల్లీ: ఉత్తర భారతంలోని ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హర్యానాలో భూకంప సంభవించింది. భూమి కంపించడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.4గా నమోదైందని భూపరిశోధన అధికారులు వెల్లడించారు. భూకంపం కేంద్రం హర్యానాలోని ఝజ్జర్ ప్రాంతంలోని పది కిలో మీటర్ల లోతులో ఉన్నట్టు వెల్లడించింది. భూకంప తీవ్రత స్వల్పంగా ఉండడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని సమాచారం.

# 'ఫీజు'లపై జూన్‌లోగా నిర్ణయం తీసుకోలేరా?

సమయంపట్టే అవకాశం ఉన్నందున బ్లాక్ పీరియడ్ (2022-23 నుంచి 2024-25)లోని ఫీజులనే 2025%-%26కు కమిటీ సిఫార్సు చేసిందన్నారు. మధ్యంతర ఉత్తర్వుల్లో పెంపునకు అనుమతిస్తే తీర్పు విరుద్ధంగా వచ్చినా తిరిగి విద్యార్థులకు చెల్లించబోరని పేర్కొన్నారు.

**70 శాతం పెంపు కోరుతున్నారు..**

ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కమిటీ ప్రతిపాదనలను ఆమోదించడం మాత్రమే సర్కార్ బాధ్యతన్నారు. కొన్ని కాలేజీలు 70 శాతం వరకు పెంపును కోరుతున్నాయని.. ఆ మేరకు పెంపునకు అనుమతిస్తే విద్యార్థులపై భారీగా భారం పడుతుందని నివేదించారు. దీనివల్ల లక్షన్నర మంది విద్యార్థులు ప్రభావితం అవుతారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడేళ్లకోసారి ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఆ మేరకు చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో ప్రతిపాదనలు పంపిస్తే జూన్ వరకు ఏం చేశారని టీఏఎఫ్‌ఆర్‌సీని ప్రశ్నించారు. మార్చిలో నోటిఫై చేసినప్పుడు కాలేజీలైనా తెలుసుకోవాలని కదా అని వ్యాఖ్యానించారు. కౌన్సెలింగ్, అడ్మిషన్ల సమయం దాకా కాలయాపన చేయడాన్ని తప్పుబట్టింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ ఉన్నా ప్రతిపాదనలపై ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించింది. శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కాగా, కేశవ్ మెమోరియల్ పిటిషన్‌ను మరో న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. ఫీజుల పెంపునకు టీఏఎఫ్‌ఆర్‌సీ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ సీబీఐటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఫీజు పెంపునకు అనుమతించారు. బీఈ, బీటెక్‌కు రూ. 2,23,000, ఎంటెక్‌కు రూ. 1,51,600, ఎంబీఏ, ఎంసీఏకు రూ. 1,40,000 పెంచాలని.. ఈ మేరకు టీజీఈఏపీసీఈటీ అడ్మిషన్లలో మార్పు చేయాలని కన్వీనర్‌ను ఆదేశించారు. 2025%-26, 2027-%28 బ్లాక్ పీరియడ్‌కు ఈ ఫీజులు వర్తిస్తాయని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటా

వెల్లడించారు. తాజాగా జరిగిన 19వ సమావేశంలో ఆ నిర్ణయాల అమలులో పురోగతిపై విస్తృతంగా చర్చించామని, 96 శాతం అంశాలకు సంబంధించి జీవోలు జారీ చేసి అమలు దశకు తీసుకెళ్లినట్టు తేలిందని చెప్పారు. కాగా ప్రతి రెండు వారాలకు ఒకసారి కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు మళ్లీ ఈ నెల 25న మంత్రివర్గ భేటీ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి 3 నెలలకోసారి ఆ కాల వ్యవధిలో జరిగే ఆరు కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించాలని కూడా నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరవేసే వ్యవస్థ పనితీరును మళ్లీ కేబినెట్‌లోనే ఇలా సమీక్షించడం దేశంలోనే తొలిసారి అని అన్నారు.

**ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50% సీట్లు**

రాష్ట్రంలోని అమిటీ, సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ విద్యా సంస్థలకు వర్సిటీలుగా గుర్తింపు కల్పించాలని కేబినెట్ నిర్ణయించినట్టు పొంగులేటి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 15 ఉత్తమ వర్సిటీల్లో అమిటీ 11/12వ స్థానంలో ఉందన్నారు. సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ సైతం అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్ చొరవతో ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించడానికి ఆ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు.

**మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాల భర్తీ**

ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని పొన్నం చెప్పారు. ఇక కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు జాబ్ కేలెండర్ సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. వచ్చే మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించామన్నారు. ఎస్సీల వర్గీకరణ సమస్యతో నోటిఫికేషన్ల జారీలో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు.

- రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అనంతరం ఆ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు పొంగులేటి వెల్లడించారు.
- గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జెడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జెడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణించి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తారు.
- సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రీశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.




**4 చోట్ల అత్యాధునిక గోశాలలు**

రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ వచ్చే కేబినేట్ సమావేశంలోపు తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది. సీఎం ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. కగా హైదరాబాద్‌లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరువులు, కుంటల్లో 80%-%110 మి.మీ. సైజు గల 82 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన బడ్జెట్‌ను రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

**ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంపునకు సంస్కరణలు**

- వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది.
- ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది.

# బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల కేసులో రంగంలోకి ఇడి

ఈ యాప్‌ల బారిన పడి, ఆర్థికంగా చితికిపోయి ఆత్మహ త్యలకు పాల్పడ్డారని పోలీసులు తమ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొ న్నారు. ఈ కేసులో యాం కర్లు శ్రీముఖి, వర్షిణి సౌందర రాజన్, సిరి హనుమంతుతో పాటు పలువురు బుల్లితెర నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్ల ను కూడా చేర్చారు. తెలంగాణ గేమింగ్ చ ట్టం, ఐటి చట్టం లోని వివిధ సెక్షన్ల కింద హైదరాబాద్ పోలీసులు కేసు నమో దు చేయగా, ఇప్పుడు ఇడి దర్యాప్తుతో ఈ కేసు మరింత తీవ్రరూపం దా ల్చింది. త్వరలోనే వీరందరినీ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. మార్చి నెలలో బె ట్టింగ్ యాప్స్ వ్యవహారం వెలుగు చూసిన విష యం తెలిసిందే. ఈ ఉదంతంలో సినీ ప్రముఖు లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూ యెన్సర్లు సహా మొత్తం 25 మందిపై పోలీసులు కేసు నమో దు చేశా రు. వీరిపై హైదరాబాద్ మియాపూర్ వాసి ప్రమో ద్ శర్మ చేసిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసారు. అయితే ఈ వ్యవహారంలో మనీలాండరిం గ్ జరిగినట్లు ఇడి అధికారులు గుర్తించారు. పోలీసుల ఎఫ్ఐఆర్ నమోదు ఆధారంగా తాజాగా ఇడి విచారణ కొనసాగనున్నది. ఇడి కేసులు నమోదు చేసిన 29 మందిలో రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రా జ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత సు భాశ్, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసం తి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పాండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, తేజ, రీతూ చౌదరి, బందరు శేషాయని సుప్రీత, కిర ణ్ గౌడ్, అజయ్, సన్నీ, సుధీర్, లోకల్ బాయ్ నాని ఉన్నారు. వీరిపై ఇది వరకే సైబరాబాద్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్‌లు 318(4), 112, 49, తెలంగాణ గేమింగ్ యాక్ట్ సెక్షన్‌లు 3, 3(ఎ), 4, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) యాక్ట్ సెక్షన్ 66(డి) కింద నమోదు చేశారు. ఈ యాప్స్ పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ 1867ను ఉల్లంఘిస్తున్నాయని, ఆర్థిక నష్టాలతో పాటు సామాజిక హాని కలిగిస్తున్నాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈడీ ఈ కేసును ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కింద దర్యాప్తు చేస్తోంది. ఈ ప్రచారాల ద్వారా భారీ మొత్తంలో డబ్బు చలామణీ, మనీ లాండరింగ్ జరిగి ఉండవచ్చని ఇడి అనుమానిస్తోంది.



## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ల కేసులో
# రంగంలోకి ఇడి

ట్వీట్ చేశారు కేటీఆర్. తెలంగాణ అస్తిత్వాన్ని భౌగోళిక గుర్తింపుని గుర్తించకపోవడం బీజేపీ అధికారిక విధానమా? అని ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు కేటీఆర్. ఈ మేరకు పలు పశ్నలు సంధించారే కేటీఆర్. 'దశాబ్దాలపాటు తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు కోసం, చరిత్రలో తమకు సరైన చోటు దక్కడం కోసం, ప్రత్యేక భౌగోళిక గుర్తింపు, ప్రత్యేక రాష్ట్రం కోసం ఎనలేని పోరాటాలు చేసింది తెలంగాణ గడ్డ. అయితే మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మా సాంస్కృతిక గుర్తింపుని అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా భారతదేశ చిత్రపటాన్ని ఉపయోగించారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణం. తెలంగాణ రాష్ట్రం అస్తిత్వాన్ని లెక్కచేయకుండా చేసిన చర్య మమ్మల్ని తీవ్రంగా బాధించింది. ఇది పూర్తిగా అనుచితమైంది. భారతదేశ చిత్రపటం నుంచి మా చరిత్రనే తొలగిస్తే మేమెవరం?, ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమా?, లేదా ఈ చర్య కేవలం ఒక పొరపాటా అనే విషయంపై మీరు వెంటనే స్పష్టత ఇవ్వాలి. ఇది తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను, బలిదానాలను అగౌరవపరచడమే కాకుండా మా చరిత్రను నిర్లక్ష్యం చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి. పొరపాటైతే, తెలంగాణ ప్రజలని అపహాస్యం చేసినందుకు మీ పార్టీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు ఝలక్!

ఇప్పటికే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ల్యాప్‌టాప్, ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు డేటా కీలకంగా మారనుంది. వీటి నుంచి డేటాను సేకరించి పనిలో అధికారులు ఉన్నారు. ప్రభాకర్ రావు ల్యాప్‌టాప్, ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కి సిట్ అధికారులు పంపించారు. ఈ క్రమంలో 2023 అక్టోబర్ నుండి మార్చి15 వరకు కాల్ డేటాను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ప్రభాకర్ రావు.. పలువురు బీఆర్ఎస్ నేతలతో, పోలీసు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపినట్టు సిట్ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక, ఇప్పటికే నిందితులు, బాధితుల స్టేట్మెంట్ ఆధారంగా సిట్ అధికారులు ప్రభాకర్ రావును విచారిస్తున్నారు. రేపు మరోసారి సిట్ ముందుకు ప్రభాకర్ రావు రానున్నారు. 2023 నవంబర్ 15 నుండి 30 వరకు అందిన సర్వీసు ప్రొవైడర్ డేటాలో 618 ఫోన్ నెంబర్లను సిట్ గుర్తించినట్టు తెలుస్తోంది. మరోవైపు.. ధ్వంసమైన హార్డ్ డిస్కులలో ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన డేటా ఉన్నట్టు సమాచారం. దీంతో, సిట్ అధికారులు.. హార్డ్ డిస్కుల పైన ఆశలు పెట్టుకున్నారు. డేటా రిట్రైవ్, హార్డ్ డిస్కులోని రహస్యాలపై సిట్ ఆరా తీస్తోంది.

# నిజమే.. మేం జాగీరుదారులం కాదు

### కాపలాదారులం.. తెలంగాణ తల్లి వాకిట జాగిలాలం
### భుజాలు తడుముకొని రాధాకృష్ణ నేరాన్ని అంగీకరించారు
### కులచట్రంలో ఇరుక్కుని ఉండటమే ఆయన మరుగుజ్జుతనం
### కేసీఆర్ దయాగుణం వల్లే నువ్వు..
### చంద్రబాబు బయట ఉన్నారు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్: ప్రపంచమంతా కుల, మతాల గోడల్ని బద్దలు కొట్టి నాగరికత వైపు వెళుతుంటే..ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి రాధాకృష్ణ ఇంకా కులచట్రంలోనే ఇరుక్కుని మరుగుజ్జుతనంతో వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కొత్తపలుకు పేరిట ఇటీవల ఆంధ్రజ్యోతిలో తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'పోలీసులకు దొరికినప్పుడు దొంగ తత్తరపడినట్టు రాధాకృష్ణ రాతల్లోనూ అలాంటి ధోరణే కనిపిస్తోంది. భుజాలు తడుముకుని నేరాన్ని తన రాతల్లో రాధాకృష్ణ అంగీకరించాడు. హైదరాబాద్‌తో సహా తెలంగాణలో స్థిరపడిన వారందరూ చంద్రబాబు కంటే కేసీఆర్ పాలనలో సంతోషంగా స్వేచ్ఛగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని చంద్రబాబు నేరుగా కేసీఆర్‌తో ఢీకొన్నా సెటిలర్లు కేసీఆర్ వెంట నిలిచారు. 2023లోనూ అవే ఫలితాలు పునరావృతం అయ్యాయి. ఇక్కడ స్థిరపడిన ఆంధ్ర ప్రజలకు చంద్రబాబు, నువ్వు టేకేదారులు అని చెప్పుకున్నా..తిరస్కరించిన సంగతి గుర్తు పెట్టుకోండి. మొదటి నుంచి తెలంగాణను వ్యతిరేకిస్తున్న ఏపీకి చెందిన ఓ వర్గంవారు ఇక్కడి నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వాళ్ల మీడియా ముసుగులు తొలగించి భరతం పడతామని నేను చెప్పాను. తమ అభిమాన నాయకుల వ్యక్తిత్వ హననంపై అభిమానులు, కార్యకర్తలు చేసిన చిన్న నిరసన మాత్రం మీకు చాలా పెద్దదిగా కనపడింది'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాధాకృష్ణ రాతల్లో పేర్కొన్నట్టు 'నిజమే మేము జాగీరుదారులం కాదు.. తెలంగాణతల్లి వాకిట జాగిలాలం, కాపలాదారులం'అని జగదీశ్‌రెడ్డి ప్రకటించారు.

**కేసీఆర్ దయాగుణం వల్లే బయట ఉన్నారు**

'ఉద్యమ సందర్భంలో మీరెంత విషం చిమ్మినా, తెలంగాణ ఏర్పడిన తర్వాత మంత్రివర్గంపై, శాసనసభపై మీరు దిగజారి మాట్లాడినా ఏ విచారణ అక్కర లేకుండా, మిమ్మల్ని 100 సార్లు జైలుకు పంపే అవకాశం వచ్చినా కేసీఆర్ క్షమాభిక్ష, దయాగుణం వల్లే బయట ఉన్నావు. మీతోపాటు మీ గురువు చంద్రబాబును జైలుకు పంపే అవకాశం వచ్చినా వదిలేయడం కేసీఆర్ గొప్పతనం. మోదీ అండ, చంద్రబాబు చెంతన ఉన్నారని, తెలంగాణ సీఎం చెప్పుచేతుల్లోనే ఉన్నారని, ఉడత ఊపులకు భయపడనని హూంకరించిన మీరు వందలమంది పోలీసులను కాపలా తెచ్చుకున్నారు. వాళ్లను, వీళ్లను బతిమాలి జరగని దాడికి ఖండనలు ఇప్పించుకుంటున్న తీరు ఏ ఊపులకు మీరు భయపడుతున్నారో అర్థమవుతుంది. సాధారణంగా మరుగుజ్జు అంటే సహజత్వానికి భిన్నంగా ఉండడం, ఎదగాల్సిన స్థాయిలో ఎదగకపోవడం లేక మానసికంగా వికసించకపోవడం. తెలంగాణ వికాసం కోసం పోరాటం చేసిన నా పరిపక్వత, రాజకీయ ప్రస్థానమేంటో అందరికీ తెలుసు. రామోజీరావుతో పోల్చుకొని పోటీపడి ఆయన పోయిన తర్వాతనైనా ఆ పీఠంలో కూర్చుందామనుకొని, ఎక్కడికో చేరుకుందామనుకొని.. అదీ చేరుకోలేకపోయావనే బాధ నీలో కనిపిస్తోంది. ఇంకా జర్నలిజం ఓనమాలలోనే ఉన్న వానికి పాపులారిటీ వస్తుందని, పోటీకొస్తున్నాడని భయపడి లేని దాడిని సృష్టించుకొని నీవు చేస్తున్న హంగామా నీ మరుగుజ్జుస్థాయికి నిదర్శనం. మీడియా అనుకొని నమ్మి బెదిరింపులు లేదా మీ బ్లాక్‌మెయిల్‌తో మీ స్టూడియోకు వచ్చిన సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, వ్యాపార ప్రముఖులు, సినీతారలు, ఇతర ప్రముఖులతో ప్రవర్తించే తీరు, జుగుప్సాక రమైన ప్రవర్తన అహంకారానికి నిదర్శనం. చాలామంది మహిళా సెలబ్రిటీలు మీ ఇంటర్వ్యూకు రావడానికి భయపడుతున్నారనేది వాస్తవం'అని జగదీశ్‌రెడ్డి తన ప్రకటనలో రాధాకృష్ణ తీరును ఎండగట్టారు.



## సాయిరామ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి

## కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు.

కోరుట్ల (వార్త మిర్రర్)జూలై 10 : కోరుట్ల పట్టణంలో గల శ్రీ సాయిరామ దేవాలయంలో గురు (వ్యాస) పౌర్ణమి సందర్భంగా సాయినాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఈసందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం భక్తుల సౌకర్యం కొరకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కొబ్బరి కాయ కొట్టి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తోపాటు ఆలయ కార్యనిర్వహణాధికారి కే.కాంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ఆలయ ధర్మకర్తలు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



## గురు పౌర్ణమి పండుగ

## వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ హమీద్ పటేల్

కొండాపూర్ వార్త మిర్రర్ : గురుపౌర్ణమి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రవీంద్ర ముదిరాజ్ , స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలోని సాయిబాబా టెంపుల్ లో ప్రత్యేక పూజలు పాల్గొన్న కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ . ఈ సందర్భంగా గురు పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరికి ఆ సాయిబాబా ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కొండపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ తెలియజేశారు. ఈ గురుపౌర్ణమి పండుగ వేడుకల్లో కార్పొరేటర్ హమీద్ పటేల్ తో బాటుగా మాజీ కార్పొరేటర్ రవీంద్ర ముదిరాజ్ , సీనియర్ నాయకులు శుద్ధపల్లి విజయ కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, కొల్లూరి, మధు ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, అజయ్, సత్యేందర్ సింగ్ సంతోష్ కుమార్, రాజేష్ యాదవ్, మురళి మోహన్, రాజేష్ యాదవ్, కచ్చావా దీపక్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్పీ క్యాంపు మైదానాన్ని పూర్తిస్థాయి

## స్టేడియంగా నిర్మించి, క్రీడలకే పరిమితం చేయాలి

మిర్యాలగూడ జూలై 10:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు రాజీవ్ స్టేడియంలో వాకింగ్ ఏర్పాటు చేయవద్దని, మైదానాన్ని క్రీడలకే పరిమితం చేయాలని క్రీడాకారులు నల్లగొండ జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి అక్బర్ ఆలీని గురువారం కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి గాను పరిశీలించి మున్సిపల్ అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించి వెళ్లిన అనంతరం క్రీడాకారులు అక్కడ ఉన్న అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి క్రీడలు నిర్వహించుకునే అవకాశం ఉండదని వారు పేర్కొన్నారు. ఈ మైదానంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిర్మించేంత స్థలం లేక ట్రాక్ ఏర్పాటు వల్ల మైదానం కుంచించుకు పోతుందని, క్రికెట్, హాకీ, ఫుట్ బాల్ ఆడేందుకు అవకాశం ఉండదని వారు పేర్కొన్నారు. గతంలో జిల్లా అధికారులు మైదానం చుట్టూ ఉన్న రోడ్లు వరకు మైదానాన్ని పెంచి స్టేడియం పూర్తి స్థాయిలో నిర్మాణం చేయాలని నిర్ణయించిన ఆదేశాలు బుట్ట దాఖలు అయ్యాయి . కావున మైదానానికి ఇరువైపున రోడ్డు వరకు మైదానాన్ని పెంచాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ లకు వినతి పత్రాలు సమర్పిస్తామని వారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ శ్రీను, అతీఫ్, హాజీ, రవి, ఆరిఫ్, సైదులు, వెంకన్న, ఇర్ఫాన్ లున్నారు.



## సైక్లింగ్ మంచిదా.. రన్నింగ్ మంచిదా.?

హయత్నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : సైక్లింగ్, రన్నింగ్ మధ్య చాలా తేడా ఉందని, సైక్లింగ్‌తో పోలిస్తే రన్నింగ్‌తోనే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని హార్వర్డ్ యూనివర్సిటీ నిపుణులు చేసిన ఓ పరిశోధనలోవెల్లడైంది. తమ పరిశోధనలో భాగంగా, 70 కేజీల బరువున్న మనిషి 30 నిమిషాల పాటు.. గంటకు 5 మీటర్ల వేగంతో రన్నింగ్ చేస్తే 288 కేలరీలు తగ్గుతాయని తేలింది. అదే సైక్లింగ్ చేస్తే 30 నిమిషాలలో 19.3 నుంచి 22.3 మీటర్ల వేగంతో సైక్లింగ్ చేయాలట. వేగం పెంచే కొద్ది శరీరంలోని కేలరీలను ఖర్చు చేయవచ్చని, శరీర కండరాలను బలోపేతం చేసేందుకు రన్నింగ్ చాలా బాగా ఉపయోగపడుతుందని వారి నిర్ధారించారు. వాస్తవానికి రన్నింగ్ కంటే సైకిల్? తొక్కడం వల్ల కండరాల సామర్థ్యం పెరుగుతుందని, కానీ, దానికి ఎక్కువ సమయం పడుతుందని వారు తెలిపారు. సైక్లింగ్ వల్ల తక్కువ కేలరీలు మాత్రమే బర్న్ చేయగలమని, పైగా మోకాలి నొప్పి ఉంటే సైక్లింగ్ చేయటం మంచిది కాదని వారు తెలిపారు. తమ లెక్క ప్రకారం. వారానికి 3 రోజులు సైక్లింగ్, 2 రోజులు రన్నింగ్ చేయటం వల్ల రెండింటి ప్రయోజనాలు పొందొచ్చని ఈ పరిశోధకులు చెబుతున్నారు. ఇక.. గుండె ఆరోగ్యం విషయంలో ఈ రెండూ మంచివేనని వీరు చెబుతున్నారు

# టిబి ముక్త్ జిల్లాగా నల్లగొండను చేయాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





మిర్యాలగూడ జూలై 10:-( వార్త మిర్రర్) నల్గొండ జిల్లాను క్షయ (టిబి)రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సవాల్ గా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో టీబి ముక్త్ భారత్ అభియాన్ పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆమె సాంకేతికత అంతగా అభివృద్ధి చెందని రోజుల్లోనే మన దేశంలో కమ్యూనిటీ సహకారంతో అంటువ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొని పారద్రోలిన ఘనత వైద్య ఆరోగ్యశాఖకు ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని టీబిని సైతం జిల్లా నుండి పూర్తిగా నిర్మూలించేందుకు ఒక సవాల్ గా స్వీకరించాలని అన్నారు . ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ తోపాటు, సంబంధిత శాఖలు కృషి చేయాలని చెప్పారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు విధులను సాధారణ పద్ధతిలో నిర్వర్తించకుండా, గుర్తింపు వచ్చేలా పనిచేయాలన్నారు. అక్టోబర్ 2 నాటికి క్షయ రహిత నల్గొండగా దిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆశా ఏఎన్ఎంలు గ్రామాలకు వెళ్లి ప్రజలకు టిబి పట్ల అవగాహన కల్పించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండే వారిని గుర్తించి చైతన్యం చేసి పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో రైస్ మిల్లులు ఎక్కువగా ఉండడం, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉన్నందున, ఈ ప్రాంతంలో టిబి వచ్చేందుకు ఆస్కారాలు ఎక్కువగా ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఇక్కడిప్రజలకు, ప్రత్యేకించి రైస్ మిల్లులో పనిచేసే వారు, డ్రైవర్లు, హమాలీలు, ఇతరులు అందరికి పరీక్షలు నిర్వహించేందుకు ఒక షెడ్యూల్ రూపొందించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. వివరాలను ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలనిచెప్పారు. అలాగే ఆశ కార్యకర్తలు ప్రతి గ్రామ పంచాయతీని సందర్శించి టీబిపై అవగాహన కల్పించాలన్నారు .బాగా పనిచేసిన ఆశ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను సన్మానించడం జరుగుతుందని ఆమె తెలిపారు. నల్గొండ, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున సుమారు 20 లక్షల రూపాయల విలువచేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్ రే మిషన్ ను వైద్య ఆరోగ్య శాఖకు ఇస్తున్నందుకు ఆమె రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. జిల్లా టీబి నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ టీబి ముక్త్ భారత్ అభియాన్ కింద చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు సర్వేను ముమ్మరం చేయడం , గుర్తించిన రోగులకు వైద్య పరీక్షలతో పాటు, క్రమం తప్పకుండా చికిత్స అందించడం, జిల్లా నుండి పూర్తిగా టీబిని నివారించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు . 2024లో జిల్లాలో 2426 టీబి కేసులు గుర్తించగా, ఇందులో 66 మంది చనిపోయారని, ఈ సంవత్సరం ఇప్పటివరకు 1,296 మందిని గుర్తిస్తే పదిమంది చనిపోయారని, తక్కిన వారికి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. రైస్ మిల్లులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో టీబి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా మిర్యాలగూడలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీబి రహిత గ్రామపంచాయతీలలో భాగంగా 2023లో జిల్లాలో 36 గ్రామ పంచాయతీలలో, 2024 లో 96 గ్రామ పంచాయతీలలో ఒక్క టీబి కేసు కూడా నమోదు కాలేదని, 2025 డిసెంబర్ నాటికి టీబి లేని జిల్లాగా అన్ని గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రుల కో ఆర్డినేటర్ డాక్టర్ మాతృనాయక్ ,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడారు స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వోలు కేస రవి, వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరీష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శి గౌరు శ్రీనివాస్, బి.వెంకటరమణచౌదరి, ప్రతినిధులు భద్రం, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ నల్గొండ జిల్లా మహాసభ కరపత్ర ఆవిష్కరణ



మిర్యాలగూడ జూలై 20 :-( వార్త మిర్రర్) సిపిఐ నల్లగొండ జిల్లా 23వ జిల్లా మహాసభ కరపత్రాన్ని స్థానిక సిపిఐ కార్యాలయంలో విడుదల చేసారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నల్లగొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండ పట్టణంలో ఈ నెల 15న జరుగుతుందన్నారు. సిపిఐ 1925 డిసెంబర్ 26న భారతదేశంలో ఆవిర్భవించి ఈ సంవత్సరం 100 సంవత్సరంలో ప్రవేశించి శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తుదన్నారు. నాటి నుండి నీటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సిపిఐ భూసంస్కరణ అమలు కోసం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించింది భారత కమ్యూనిస్టు పార్టీ అని వారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది అమరులైనారన్నారు ఆనాడు భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సిపిఐ కుందన్నారు. ఆనాడు దున్నే వానికి భూమి కావాలని నినాదంతో పది లక్షల ఎకరాలు పంచిన ఘన చరిత్ర సిపిఐకి ఉన్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక చట్టాల మీద కార్మికులను రైతులను సమీకరణ చేసి పెద్ద ఎత్తున పోరాటం జరుపుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులు ధరలను అదుపు చేయకుండా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారం వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అన్ని హామీలను వెంటనే యుద్ధప్రాతీపదికన నెరవేర్చాలన్నారు ఈ కరపత్రం విడుదల చేసిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.సయీద్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి ఎర్రబోతు పద్మ, దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కార్యదర్శి వల్లంపట్ల వెంకన్న, మండల సమితి సభ్యులు గూగుల్ యాదగిరి, బంటు రాజేశ్వరి, గువ్వల మట్టయ్య, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, అంజమ్మ, సులోచన, వెంకటయ్య విడుదల చేసినారు

# సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ఐక్యత పౌండేషన్ సేవలు

### - నేటికి 79 మందికి కంటి శుక్లాలల సర్జరీలు పూర్తి

### 450 కి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణి





కల్వకుర్తి జూలై 10 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని సికెఆర్ ఫంక్షన్ హాల్లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ వారిచే ట్రస్ట్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి బారీగా ప్రజలు తరలి వచ్చి కంటి సమస్యలను తొలగించుకున్నారు. రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూనియోజకవర్గ వ్యాప్తంగా సంపూర్ణంగా అంధత్వ నిర్మూలనకై కృషి చేస్తున్నామని, నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని,ప్రస్తుతం కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిభిరం పెద్ద ఎత్తున పేద ప్రజలకు చేరువైతున్నాయని, ఇప్పటివరకు ఆరు రోజులుగా 5000 మందికి పైగా శిబిరాన్ని సందర్శించగా,వారిలో 2600 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని, వాటిలో 170 మందికి కంటి శుక్లాల సర్జరీకి ఎంపిక చేశామని,వీరిలో 79 మందికి విజయవంతంగా సర్జరీలు పూర్తి చేశామని, ఆరు రోజులుగా 2000 కి పైగా ఉచిత కంటి అద్దాలు అందజేశామని రేపటితో ముగియనున్న కంటి పరీక్షల సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, గణేష్,రఘు, యాదయ్య,శ్రీపతి,శేఖర్,శ్రీను, నాగిళ్ల శివ, కళ్యాణ్ పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా

# శ్రీశ్రీశ్రీ సద్గురు బం అన్వరానంద బాబా పూజా కార్యక్రమం

### అన్వరానంద బాబా శిష్యుడు బద్దం

### వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, చీరల పంపిణీ

ఎల్బీనగర్,10 జులై :గురు పౌర్ణమి సందర్భంగా వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గణేష్ టెంపుల్ ఆవరణంలో గురు పౌర్ణమి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ బం బం అన్వరానంద బాబా పూజా మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. భంభం అన్వారానంద బాబా శిష్యుడు ప్రధాన శిష్యుడు, సంఘ సేవకుడు బద్దం వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి పూజ మహోత్సవ కార్యక్రమాలు కనుల పండుగ నిర్వహించారు. 500 మంది పేద మహిళలు, జిహెచ్ఎంసి మహిళా సిబ్బందికి ఉచిత చీరల పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి పేద మహిళలకు ఉచిత చీరలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉచిత చీరల పంపిణీలో బద్దం వినోద్ రెడ్డి తో పాటు ఆయన కుటుంబ సభ్యులు హాజరై మహిళలకు పంపిణీ చేశారు. ముందుగా శ్రీశ్రీశ్రీ సద్గురు బంబం అనువారానంద బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గురు పౌర్ణమి సందర్భంగా తమ గురువు ఆత్మకు శాంతి జరిగే విధంగా ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం, ఉచిత చీరలు పంపిణీ నిర్వహిస్తున్నానని బం బం బాబా భక్తుడు బద్దం వినోద్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, మిట్ట రామ్మోహన్, అయ్యప్ప టెంపుల్ పాలకవర్గ సభ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## ఏలే అంతమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న.. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఏలే ఉమాశంకర్ ప్రముఖ రియాక్టర్ ఏలే పురేందర్ తల్లి ఏలే అంతమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఏలే అంతమ్మ గారి చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, ఢిల్లీ వెంకట్ గౌడ్, వీరమల్ల జంగయ్య, సురపల్లి జవహర్, అచ్చిని ప్రవీణ్ ప్రవీణ్, రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ ఏలే అంతమ్మ వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారుఈ కార్యక్రమంలో ఏలే ఉమా శంకర్, ఏలే పురేందర్, సురపల్లి గాలయ్య, పొట్ట బత్తిని బాలరత్నం తదితరులు పాల్గొన్నారు



## ఏలే అంతమ్మ దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన... సికిలమెట్ల శ్రీహరి- - గణేష్ సాగర్ మిత్ర బృందం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఏలే ఉమాశంకర్ ప్రముఖ రియాక్టర్ ఏలే పురేందర్ తల్లి ఏలే అంతమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఏలే అంతమ్మ గారి చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించిన, మాజీ యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు సికిలమెట్ల శ్రీహరి, యాదాద్రి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గోల్లూరి గణేష్ సాగర్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు అక్కన్నపల్లి వీరయ్య, ఇరువురు మాట్లాడుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏలే ఉమా శంకర్, ఏలే పురేందర్, సురపల్లి గాలయ్య, పొట్ట బత్తిని బాలరత్నం తదితరులు పాల్గొన్నారు



## యోగా గురువు ఉపేంద్రరావుని ఘనంగా సన్మానం చేసిన హరిణ వనస్థలి నేషనల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు జగదీష్ యాదవ్, యోగ సభ్యులు

ఎల్బీనగర్,10 జులై : గురు పౌర్ణమి పురస్కరించుకొని ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు పాఠశాలలతో పాటు, యోగా గురువులను, ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేసి వారి ఆశీస్సులను తీసుకున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా మున్సురాబాద్ గేట్ హరిణ వనస్థలి మహావీర్ నేషనల్ పార్క్ లో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, జక్కుల మల్లేష్ యాదవ్, యోగ సభ్యులు యోగ గురువు ఉపేందర్ రావు ని ఘనంగా సన్మానం చేశారు. సభ్యులు కృష్ణ గౌడ్, మహేందర్ రెడ్డి, శంకర్, విద్యాసాగర్, అమరేందర్ రెడ్డి, బిక్షపతి యాదవ్, రామ్ రెడ్డి, సద్గురు రెడ్డి, నర్సింహా రావు, అశోక్, విజయేందర్ రెడ్డి, నరసింహ యాదవ్, పాల్గొన్నారు.



## నాలా స్థలం ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నటువంటి వారి పై చర్యలు తీసుకోవాలి..

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 10చౌటుప్పల్ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పురపాలక పరిధిలోని వలిగొండ కు వెళ్లే రోడ్డులో సర్వేనెంబర్: 176 లో బఫర్ జోన్ సంబంధించి నాలా స్థలం ఆక్రమించుకుని నిర్మాణం చేస్తున్నారు.ఈ నిర్మాణనికి ఎన్ ఓ సి సంబంధించిన పవర్ ఎవరు ఇచ్చారు. పర్మిషన్ ఏ విధంగా వచ్చినది గతంలో ఈ యొక్క స్థలంలో నిర్మాణాలను జిల్లా కలెక్టర్ తొలగించినారు.నేడు నాటి కలెక్టర్ మరియు పురపాలక పాలకవర్గం లేని సమయంలో రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్నారు. గత 03-07-2025 రోజున స్థానిక మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇచ్చిన గాని ఇంతవరకు మీ యొక్క అక్రమ కట్టడాలను నిలుపుదల వీటిపై తగు విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను తొలగించి ఈ యొక్క స్థలం నాలాకు రక్షణ కల్పించాలని చౌటుప్పల్ ఆర్డీవో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్,రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్, దూడల భిక్షం గౌడ్, రమణగోని శంకరయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకుని మల్లేశం,పోలోజు శ్రీధర్ బాబు, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, ఉడుగు యాదయ్య గౌడ్, ఉబ్బు బిక్షపతి, కాసుల వెంకటేశం,గోశిక పురుషోత్తం, దిండు భాస్కర్, తడక సురేఖ, గోశిక నీరజ, పాలెం అశోక్, కానుగు శేఖర్, ఉష్కాగుల నాగరాజు, తోకల సాయి,బుడ్డ సురేష్, బడుగు కృష్ణ, పబ్బు వంశీ,గుండెబోయిన వేణు,ఇటికాల దామోదర్ రెడ్డి,వరగంటి భాను ప్రకాష్, గౌతమ్,కళ్యాణ్ రెడ్డి,కార్తీక్ రెడ్డి, లింగస్వామి,తదితరులు పాల్గొన్నారు..

# తాటికోల్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

### భూమి పూజ లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ జూలై 10 వార్త మిర్రర్ :దేవరకొండ మండలంలోని తాటికోల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని విధంగా రైతన్నల సంక్షేమం కోసం 9 రోజుల్లో 9 వేల కోట్లు పెట్టుబడి సాయాన్ని అందించింది మన ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు.పేద ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఆశీర్వాదం మరింత ప్రోత్సాహాన్నిస్తుంది అని తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం కోసం కృషి చేస్తున్నామని అలాగే సంవత్సరం నర కాలంలోనే ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నామని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లు నిర్మాణలు చెప్పట్టడం జరుగుతుందని గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నాం అని అన్నారు.అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు,వివిధ హోదాల్లో ఉన్న నాయకులు,అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# చందంపేట ఎంఈఓ బాధ్యతలు సీనియర్ ఉపాధ్యాయులకే అప్పగించాలి

### ఎస్ఎఫ్ఐ డిమాండ్



దేవరకొండ జూలై 10 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో గురువారం నాడు ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది సందర్భంగా దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలంలో విద్యా పరిరక్షణ,సమర్థవంతమైన నిర్వహణ కోసం తక్షణంగా సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా 1996 డీఎస్సీ ద్వారా నియమితులై,25 సంవత్సరాలకుపైగా అనుభవంతో ప్రస్తుతం పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ ప్రధానోపాధ్యాయులు చందంపేట మండలంలో చాలామంది ఉన్నారని ఉన్నారు. వీరికి ఎంఈఓ బాధ్యతలు అప్పగిస్తే విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.గతంలో ఎఫ్.ఏ.సీ. విధానాన్ని అనుసరించి బాధ్యతలు అప్పగించడం వల్ల పలు ఘటనల్లో ఉపాధ్యాయులు స్కూల్‌కు హాజరు కాకుండా జీతాలు తీసుకోవడం,తరువాత సస్పెండ్ అవ్వడం వంటి పరిస్థితులు తలెత్తాయి.దీనివల్ల విద్యార్థుల భవిష్యత్తు హాని చెందిందని. ఈ తప్పిదాలను పునరావృతం కాకుండా చూడాలంటే, తక్షణమే ఎఫ్.ఏ.సీ. విధానాన్ని విరమించి, సీనియర్ ప్రధానోపాధ్యాయులకు నియమించిన విధంగానే బాధ్యతలు అప్పగించాలని అన్నారు.చందంపేట మండలంలోని పొగిళ్ల, కంబాలపల్లి వంటి మారుమూల గ్రామాల్లోని పాఠశాలలు 60 నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ పాఠశాలలకు సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం సీనియర్ ఉపాధ్యాయులే అనువైన వ్యక్తులు. వారు బాధ్యతలు చేపట్టినచో మూతబడ్డ పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. విద్యార్థులకు సరైన విద్యా అవకాశాలు కలుగుతాయి.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధికి నూతన దిశగా చర్యలు తీసుకుంటుండగా,ఆయన సంకల్పాన్ని నిలబెట్టేందుకు స్థానిక స్థాయిలోనూ విద్యలో శుద్ధి, పారదర్శకత అవసరం.అంతెందుకు గాక, విద్యా శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, చందంపేట మండల ఎంఈఓ బాధ్యతలు సీనియర్లకు అప్పగించి,ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని గిరిజన సంక్షేమ బాగు కొరకు ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో ఎస్ ఎఫ్ ఐ జిల్లా కమిటీ సభ్యులు పొట్ల రాకేష్, జొన్నలగడ్డ చరణ్, పార్వతం మునేష్, రాము, మల్లికార్జున్, వాజాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

## తంగడపల్లి పెద్దమ్మ దేవాలయం నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షులుగా ఎన్నికైన చింతల రాజు ముదిరాజ్



వార్తా మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూలై 10 : చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి లో శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం సభ్యులు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది నూతన కమిటీ అధ్యక్షుడు గా చింతల రాజు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు బొల్లమోని శ్రీకాంత్ ముదిరాజ్ ,గౌరవ అధ్యక్షులు గా గట్టు మొగులయ్య ముదిరాజ్, కందుల పుల్లయ్య, గౌరవ సలహాదారులు గా బొల్లమోని వెంకటయ్య, శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గా బొల్లమోని స్వామి, కోశాధికారి గా నక్క రమేష్, కార్యదర్శిగా జిల్లామోనీ గణేష్ ఎన్నిక అయ్యారు..

## అడక్వసిని రద్దు చేసి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

### బోయ రాములు జిల్లా అధ్యక్షులు

### ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి.



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 10 : చౌటుప్పల్ మండల కేంద్రంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బోయ రాములు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల లో జీవో నెంబర్ 2 లో ఉన్న అడక్వసిని వల్ల అనేక మంది ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ రాక అన్యాయం జరుగుతుంది.జీవో నెంబర్ 2 లో ఉన్నటువంటి అడక్వసీ అనే పదాన్ని తొలగించి ఎస్సీ ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ ప్రమోషన్స్ న్యాయం చేయాలని,అలాగే ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఉద్యోగులు ఇన్ సర్వీసులో హయ్యర్ ఎడ్యుకేషన్ చేయుటకు సంబంధించిన జి.ఓ. 342 పూర్తి స్థాయిలో అమలు చేయుటకు అడ్డంకిగా ఉన్న 26559 మెమో ను రద్దు చేసి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ ఉద్యోగులు హయ్యర్ ఎడ్యుకేషన్ చేయుటకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



## దండు మల్కాపురంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ కన్వీనర్ గా ముదిగొండ వెంకటేష్ ఎన్నిక

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 10చౌటుప్పల్ మండలం గ్రామం దండు మల్కాపురంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడు ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ కన్వీనర్ గా ముదిగొండ వెంకటేష్ ను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను నియమించిన మునుగోడు మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కి చౌటుప్పల్ బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ కి దండు మల్కాపురం బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులు అందరికీ నా యొక్క ధన్యవాదాలు తెలియజేశారు.నా మీద నమ్మకం ఉంచి నా నాతో పాటే పార్టీ బలపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తాను. ఎన్నికైన కో కన్వీనర్ జొన్నగంటి గోపాలు వెంకటేశు, సిలివేరి వెంకటేష్,గొర్ల బుర్ర జంగారెడ్డిగూడెం యూత్ కన్వీనర్ చామట్ల పరమేష్,సోషల్ మీడియా కన్వీనర్ గుర్రం శివకుమార్,మల్కాజ్గిరి శ్రీశైలం, గ్రామ ప్రచార కార్యదర్శి రాచర్ల వెంకటేష్, పబ్బు శివ, తదితరులు పాల్గొన్నారు..



## విశ్వ గురు వ్యాసమహర్షి వచనాలు సదా ఆచరణీయం

వార్తా మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 10

అక్షర కళాభారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ చౌటుప్పల ఆధ్వర్యంలో వేద వ్యాసుని జయంతోత్సవాలు చౌటుప్పల పురపాలిక కేంద్రంలో గట్టు శ్రీరాములు ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికిసంస్థ ఉపాధ్యక్షులు కానుగుల వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ ఉత్సవంలో ప్రముఖ సాహితీవేత్త ప్రధాన కార్యదర్శి బడుగు శ్రీరాములు మాట్లాడుతూ వేద వ్యాసుని సందేశాలు వచనాలు సదా ఆచరణీయమని, వాటిని త్రికరణ శుద్ధిగా పాటిస్తే సమాజం శాంతి ధామం అవుతుందని అన్నారు.ఈ గురు పూర్ణిమ నీ పురస్కరించుకొని ప్రముఖ పంచాంగ గణిత సిద్ధాంతి బ్రహ్మశ్రీ రాచకొండ వేణు కుమార్ ఆచార్య , ఆరోగ్య సమాజ స్థాపన కై కృషి చేస్తున్న డాక్టర్ అవ్వారు శ్రీనివాస్ ప్రసాద్, సమాజ హితైసులు అయ్యాడపు ప్రతాపరెడ్డి, జిల్లా చంద్రం, ఎదునోజు విశ్వనాథ ఆచార్య బ్రహ్మశ్రీ రాచకొండ భాస్కరాచార్య లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బడుగు జయప్రకాష్, కాసోజు విద్యారాణి,బాలగోని వెంకటేశం,పోలోజు రాజు, పోలోజు వెంకటాచారి,దేశగొనీ శ్రీశైలం గౌడ్, సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



### బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో

## గీతా ప్రవచనం, గోరింటాకు సంబరాలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హఫీజ్ పేట్ డివిజన్ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయము, హుడా కాలనీలో బీజేపీ హఫీజ్ పేట్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ మహిళ మోర్చా సమక్షంలో గీతా పారాయణ ప్రవచనం మహిళలకు ఆషాడమాసం గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు.అలాగే వివిధ కళాకారులను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు డా.శిల్పా రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవి కుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత కొన్ని వేల సంవత్సరాల నుంచి లోకాన్ని ప్రభావితం చేస్తూ ఉంది. ప్రపంచం ఎంతగా మారినా, మనిషి జీవితం ఎంత మారినా భగవద్గీత ఇప్పటికీ మనకి దారి చూపిస్తూనే ఉంది. పుట్టుక దగ్గర నుంచీ చావు దాకా, నాయకత్వం దగ్గర నుంచీ యుద్ధం దాకా ప్రతి రంగానికీ ఉపయోగపడుతోంది అన్నీ సందర్భంగా తెలియజేశారు.అలాగే గోరింటాకు సంబరాలు అంటే ఆషాడ మాసంలో మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని జరుపుకునే సంబరాలు అని, ఇది ఒక సంప్రదాయ పండగలగా తెలంగాణలో జరుపుకుంటారని, మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారని, అంటువ్యాధులను దూరం చేసుకుంటారని, ఈ సంబరాలు ఆషాడ మాసంలో ప్రత్యేకంగా మహిళలు జరుపుకుంటారని, ఈ గోరింటాకు సంబరాల కార్యక్రమాన్ని మహిళలు ఇంత పెద్ద ఎత్తున జయప్రదం చేసినందుకు, వారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు మోహన్ రావు , మహేశ్వర్ , వేముల వేణుగోపాల్, మహిళా నాయకులు పద్మ, మేరీ , పార్వతి , నిర్మల , వినయ, దేవాల్ , శ్రీనివాస్ యాదవ్ , పవన్ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వయస్సులో బూస్టర్ డోసు నాలుగు తీవ్రమైన వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది.. ..డాక్టర్ ఎల్. నాగేశ్వర్ రావు



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : టీకా ద్వారా నివారించగల వ్యాధుల నుండి పిల్లలను రక్షించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాల నడుమ, పాఠశాల ప్రవేశ వయస్సులో పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు మరియు పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, ఆ రోగనిరోధక శక్తి కాలక్రమేణా బలహీనపడుతుంది. అందుకే పిల్లలకు నాలుగు మరియు ఆరు సంవత్సరాల మధ్య ఆ రక్షణ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇండియన్ నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ 6, 10 మరియు 14 వారాలలో డీటీపీ టీకాలు, 16 నుండి 24 నెలలకు బూస్టర్‌తో కూడిన టీకాలు వేయాలని వివరిస్తుంది. పోలియో టీకాలు కూడా 6 మరియు 14 వారాలలో పాక్షిక మోతాదులలో ఇవ్వబడతాయి. అయితే, నాలుగు సంవత్సరాల వయస్సులో యాంటీబాడీ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి, ముఖ్యంగా పిల్లలు పాఠశాల పరిసరాలలో ఎక్కువ మంది పిల్లలను కలవటం ప్రారంభించినప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. హైదరాబాద్‌లోని పీడియాట్రిక్స్ కన్సల్టెంట్, డాక్టర్ ఎల్. నాగేశ్వర్‌రావు ఎం.డి పీడియాట్రిక్స్ వారు మాట్లాడుతూ నాలుగు నుండి ఆరు సంవత్సరాల మధ్య, పిల్లలు పాఠశాల మరియు ఇతర ప్రదేశాలలో ఎక్కువ గా తమ తోటి వారిని కలుసుకోవటం తో పాటుగా పెద్ద సంఖ్య లో ప్రజలను కలుసుకోవటం చేస్తారు. ఆ పిల్లలకు చిన్నతనంలో అందించిన టీకాలు అందించే రోగనిరోధకత శక్తి తగ్గుతున్నందున ఈ దశ వైద్యపరంగా ముఖ్యమైనది. ఈ దశలో డిటిపి మరియు పోలియో బూస్టర్‌ను అందించడం వలన ఒకప్పుడు అధికంగా కనిపించిన ప్రమాదకర వ్యాధుల నుండి నిరంతర రక్షణ లభిస్తుంది అని అన్నారు.పొరుగు దేశాలలో పోలియోవైరస్ వంటి వ్యాధులను నిరంతరం గుర్తించడం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న ప్రాంతాలలో దాని నిశ్శబ్ద వ్యాప్తిని గమనించటం చేస్తారు. నిపుణులు కూడా ఈ దిశగా తగు జాగ్రత్త లు తీసుకుంటుంటారు. జనాభా స్థాయి లో రోగనిరోధక శక్తిని కొనసాగించకపోతే తిరిగి పుంజుకునే ప్రమాదం ఉందని ప్రపంచ మరియు జాతీయ నిఘా డేటా నిర్ధారించింది.ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధునిక కాంబినేషన్ వ్యాక్సిన్ల వాడకాన్ని సిఫార్సు చేస్తుంది, ఇవి ఒకే మోతాదుతో బహుళ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణను అందిస్తాయి. ఇవి ముఖ్యంగా పాఠశాల సంవత్సరాల్లో ప్రయోజనకరంగా ఉంటాయి. పాఠశాల ప్రవేశ వయసులో బూస్టర్ టీకాలు ఇమ్యూ నైజేషన్ షెడ్యూల్‌లో ఒక ముఖ్యమైన తనిఖీ కేంద్రంలా పనిచేస్తుంది. ఇది ఏదైనా తప్పిపోయిన లేదా ఆలస్యమైన మోతాదుల కారణంగా ఎదురయ్యే సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. నిరంతర ప్రయత్నాల కారణంగా నియంత్రణలో ఉన్న వ్యాధుల నుండి మన మొత్తం రక్షణను బలోపేతం చేస్తుంది" అని డాక్టర్ రావు జోడించారు.ఎక్కువ మంది టీకాల ప్రాముఖ్యత గురించి తెలుసుకుంటున్నందున, అనేక పాఠశాలలు నవీకరించబడిన ఆరోగ్య, టీకా రికార్డులను అడగడం ద్వారా సహాయం చేస్తున్నాయి. టీకాలు వేయడం అనేది ఒకసారి మాత్రమే జరిగే పని కాదు, ఆరోగ్యంగా ఉండటానికి మనం దానిని అనుసరించాల్సిన అవసరం ఉంది. పాఠశాల ప్రారంభించే ముందు మీ బిడ్డ పూర్తిగా రక్షించబడ్డారని నిర్ధారించుకోండి. వారిని సురక్షితంగా ఉంచడానికి మరియు అందరికీ ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడానికి ఇది ఉత్తమ మార్గాలలో ఒకటి అని తెలిపారు.



## సాయిబాబా దేవాలయంలో ట్రస్ట్ చైర్మన్ చిన్నమనేని నివేదిత కృష్ణారావు ప్రత్యేక పూజలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయంలో ట్రస్ట్ చైర్మన్ చిన్నమనేని నివేదిత కృష్ణారావు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేశారు.. వివిధ గ్రామాల నుండి అనేకమంది భక్తులు దర్శనం చేసుకుని మొక్కలు తీర్చుకున్నారు.. ఈ కార్యక్రమంలో హిమవంత రావు, అర్చకులు శివ శంకర్ శర్మ బృందం, భరత్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, పుటకం రాజారెడ్డి, మాజీ సర్పంచ్ సామల లావణ్య వేణు, నీరటి శ్రీనివాస్, మరిపెల్లి నారాయణ గౌడ్, కొల్లూరు వేణు, నేరెళ్ల లక్ష్మయ్య, చంద్రకంటి రవీందర్, సుర కంటి నాగిరెడ్డి, కటిక రాజేశం, సామల మధు, రాయికల్ మహిళా సేవా సమితి సభ్యులు, యువకులు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక వ్యక్తి అధికార పార్టీలో చేరితే అతని అక్రమ కట్టడాలు చట్టబద్ధమవుతాయా?

### బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ యూత్ అధ్యక్షుడు తూర్పునూరు నరసింహగౌడ్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జులై 10 : చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ కు వెళ్లే రోడ్డులో సర్వేనెంబర్: 176 లో బఫర్ జోన్ సంబంధించి నాలా స్థలం ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇల్లు నిర్మాణం చేస్తున్నారు.బి ఆర్ఎస్ పార్టీ మున్సిపల్ యూత్ అధ్యక్షుడు తూర్పునూరు నరసింహా గౌడ్ పత్రిక ప్రకటన ద్వారా మాట్లాడుతూ గతలో భారీ వర్షాలు కుడిచినప్పుడు రాంనగర్ ప్రాంతం శాంతినగర్ ప్రాంతం వరద ముంపుతో తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని అన్నారు.నిర్మాణనికి ఎన్ ఓ సి సంబంధించిన పవర్ ఎవరు ఇచ్చారు.పర్మిషన్ ఏ విధంగా వచ్చినది గతంలో ఈ స్థలంలో నిర్మాణాలను జిల్లా కలెక్టర్ తొలగించినారు.నేడు నాటి కలెక్టర్ మరియు పురపాలక పాలకవర్గం లేని సమయంలో రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్నారు.వందలాది కుటుంబాలు తమ చిన్న ఇంటి కోసం పోరాడుతుంటే,అదే ప్రాంతంలో కొంతమంది అధికార పార్టీలోకి మారినవారు పెద్ద బంగ్లాలు నిర్మించినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది.



## ఏ ఐ బి యస్ యస్, రాయికల్ పట్టణ అధ్యక్షులుగా రాకేష్ నాయక్ ఎన్నిక....

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 10 : గురువారం రోజున అల్ ఇండియా బంజారా సేవ సంఘ్ రాయికల్ పట్టణ ఎన్నికలు శివాజీ ఫంక్షన్ హాల్ లో జరిగింది.ఇట్టి ఎన్నికల్లో భూక్యా రాకేష్ నాయక్ ను ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షులు భూక్యా గోవింద్ నాయక్ ఎన్నిక చేశారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం అయిన యావత్ తెలంగాణ బంజారా బిడ్డలు ప్రతి సంవత్సరం జులై మాసంలో రెండవ మంగళవారం రోజున వారి దేవత మూర్తులు శీత్లా భవాని వేడుకలు ఘనంగా అరణ్యంలో పశుసంపద పెంపొందడం, పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండడం, చిన్న పిల్లలకు అంటూ వ్యాధులు రాకుండా ఉండడం కొరకు ఈ అమ్మ వారిని కొలుస్తారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఒక రోజు సెలవు దినం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ రాయికల్ లో అధికంగా గిరిజన ప్రజలు ఉన్నందున గిరిజన పిల్లలు కుడు గుడు కు ఆర్థికంగా వెనుక బడిఉన్నందున కేంద్ర ప్రభుత్వం రాయికల్ లో ఏకలవ్య పాఠశాలను మంజూరు చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షులు గూగ్లవత్ చిరంజీవి నాయక్, ప్రధాన కార్యదర్శి భూక్యా శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పుడు 8 గంటలకు ముందుగానే.. తుది చార్ట్ కూడా ఉంటుందని తెలుసా? ఎంత సమయానికి ముందుగా.

రైళ్ల చార్ట్‌ను 8 గంటల ముందుగానే సిద్ధం చేయాలని సూచనలు జారీ చేసింది రైల్వే. కానీ తత్కాల్ లేదా ప్రీమియం తత్కాల్ కోటాలో ఎటువంటి మార్పు చేయలేదు. ఈ విధంగా చార్ట్ సిద్ధం చేయబడి ఆ రైలులో తత్కాల్..ఇటీవల భారతీయ రైల్వే చార్ట్ తయారీ సమయాన్ని మార్చింది. గతంలో రైలు బయలుదేరడానికి నాలుగు గంటల ముందు దీనిని తయారు చేసేవారు. కానీ ఇప్పుడు దీనిని ఎనిమిది గంటల ముందు తయారు చేస్తున్నారు. తద్వారా కన్ఫర్మ్ చేసిన సీట్లు పొందని వారు సకాలంలో ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించవచ్చు. కానీ రైళ్లలో మరొక చార్ట్ తయారు అవుతుందని మీకు తెలుసా..? ఈ చార్ట్ ఎవరి కోసం తయారు చేస్తారు.. ఏ రైళ్లలో ఉపయోగిస్తారు? మీరు ఈ రైళ్లలో టిక్కెట్లు కూడా బుక్ చేసుకోగలరా? తెలుసుకుందాం.ఇది కూడా చదవండి: విద్యార్థులకు గుడ్‌న్యూస్.. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన ఆ ప్రభుత్వం!ఈ సందర్భంగా రైల్వే మంత్రిత్వ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. అన్ని రైళ్లలో ఎనిమిది గంటల ముందుగానే చార్టులను తయారు చేయడం ప్రారంభించామని, అయితే ఈ చార్ట్ కాకుండా, రైలు బయలుదేరే అరగంట ముందు మాత్రమే మరొక చార్ట్ తయారు చేస్తామని చెప్పారు



## త్రిపుల్ ఐటి సీటు సాధించిన విద్యార్థినికి ఘన సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 10 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జిల్లా పరిషత్ మూటపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం10వ తరగతి లో మంచి ప్రతిభను చూపి ట్రిపుల్ ఐటీ బాసర లో సీటు సాధించిన విద్యార్థిని ఏనుగు రుచిత ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు శాలువాతో సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహిత రుచిత మాట్లాడుతూ నాకు సీటు రావడం లో ప్రధానోపాధ్యాయులు రాజు, ఇతర ఉపాధ్యాయులు సహకారం మరువలేను అని అన్నారు. అంతే కాకుండా తన వెన్నుతట్టి ప్రోత్సహించిన తల్లిదండ్రులు లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ సాధించిన కుమారి రుచితకు అభినందనలు తెలుపుతూ విద్యార్థులందు ఇలాంటి విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని, మన స్థాయిని స్థానాన్ని మార్చేది విద్య మాత్రమేనని, విద్యార్థులు అందరు చదువు పట్ల ఆసక్తిని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సుజాత, చందు, రాజకిరణ్, జాన్, అంజూమ్ బేగం, ప్రియాంక, శేఖర్, ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## అల్లిపూర్ పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ఆర్థిక చేయూత

### తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జూపల్లి భాస్కర్ రావు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జులై 10 : పద్మనాయక వెలుమ సంక్షేమానికి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలంగాణ రాష్ట్ర పౌల్ట్రీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జూపల్లి భాస్కర్ రావు అన్నారు. గురువారం రోజున హైదరాబాదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్లిపూర్ గ్రామానికి చెందిన పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం అసంపూర్తిగా ఉన్న భవనం పూర్తి చేయడానికి రెండు లక్షల రూపాయలు వెలుమ సంక్షేమ సంఘం అధ్యక్షులు రత్నాకర్ రావు ఆధ్వర్యంలో గంద్ర శ్రీనివాస్ రావు సహాయ సహకారాలతో హైదరాబాద్ కి చెందిన తెలంగాణ పౌల్ట్రీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జూపల్లి భాస్కర్ రావు అధ్యక్షులకు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ అల్లిపూర్ కు చెందిన పద్మనాయక వెలుమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. పద్మనాయక వెలుమ సంక్షేమానికి పాటుపడే వ్యక్తులకు వ్యవస్థలకు తన వంతు సహకారం తప్పక ఉంటుందని భాస్కర్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐవా ప్రధాన కార్యదర్శి పూసుకూరి శ్రీకాంత్ రావు, గంద్ర శ్రీనివాస్ రావు కీ పద్మనాయక వెలుమ సంఘం యువజన అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస రావు కోశాధికారి ద్యావనపెల్లి వేణుగోపాల్ రావు సంఘం తరుపున భాస్కర్ రావు కి, శ్రీనివాస్ రావు కి, శ్రీకాంత్ రావు గార్లకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# తగ్గుతున్న బంగారం ధరలు.. ఇంకా పెరుగుతాయా? తగ్గుతాయా? తులం ధర ఎంత?

ప్రపంచ వ్యాపార చర్చలు, భారతదేశ భవిష్యత్ వ్యాపార దిశ, బంగారం ధరల మార్పులపై ప్రభావం చూపుతున్నాయి. పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా బంగారం వంటి సురక్షిత పెట్టుబడుల విషయంలో జాగ్రత్తలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు..బంగారం ధరలు పతనమవుతున్నాయి. ఒక రోజు తగ్గితే మరో పెరుగుతున్న పసిడి.. గురువారం స్వల్పంగా తగ్గింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (%×దీజీూ%) వెబ్‌సైట్ ప్రకారం.. గురువారం ఉదయం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.98,170 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.89,990 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి కూడా స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం కిలో ధర రూ.1,09,900 వద్ద ఉంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 98,170 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.89,990 వద్ద ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 98,320 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.90,140 వద్ద ఉంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 98,170 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.89,990 వద్ద ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 98,170 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.89,990 వద్ద ఉంది.బంగారం ధర డాలర్లలో వర్తకం చేస్తారు. అందుకే డాలర్ పెరుగుదల సాధారణంగా ఇతర కరెన్సీలతో కొనుగోలుదారులకు బంగారం ఖరీదైనదిగా మారుతుంది. ఇది డిమాండ్ విలువైన లోహం ధర తగ్గడానికి దారితీస్తుందిబంగారం ధరలు ఎలా ఉంటాయి?ప్రస్తుతం బంగారం ధరలు పడిపోతున్నా.. మళ్లీ పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తగ్గుతున్న బంగారం ధరలు స్వల్పకాలికమేనని అంటున్నారు. భారత మార్కెట్ లో బంగారం ధరలు రాబోయే రోజుల్లో 99 వేల నుంచి లక్ష రూపాయల మధ్య స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరికొంత మంది నిపుణులు 95 నుంచి



ఒక లక్ష రూపాయల మధ్యగా బంగారం ధరలు స్థిరపడవచ్చని పేర్కొంటున్నారు.ట్రంప్ నినాదాల నేపథ్యంలో ప్రపంచ వ్యాపార చర్చలు, భారతదేశ భవిష్యత్ వ్యాపార దిశ, బంగారం ధరల మార్పులపై ప్రభావం చూపుతున్నాయి. పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా బంగారం వంటి సురక్షిత పెట్టుబడుల విషయంలో జాగ్రత్తలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. నోట్: పైన పేర్కొన్న బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. అందుకే కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవడం మంచిది. ఎందుకంటే రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు.

# డిజిటల్ బంగారంతో లాభాల పంట..ఈటీఎఫ్‌లతో అనేక ప్రయోజనాలు

భారతీయులకు బంగారమంటే మక్కువ చాలా ఎక్కువ. దాన్ని కొనుగోలు చేయడానికి ఎప్పుడూ ఇష్టపడతారు. ఇంట్లో జరుపుకొనే ఏ కార్యక్రమంలో అయినా బంగారానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ప్రజలు తమ పొదుపులో ఎక్కువ భాగాన్ని దీన్ని కొనుగోలు చేయడానికి వెచ్చిస్తారు. మన దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా బంగారానికి భారీ డిమాండ్ ఉంది. దీంతో ఆ లోహం ధర ఎప్పుడూ పెరుగుతూనే ఉంటోంది. ఈ నేపథ్యంలో గోల్డ్ ఈటీఎఫ్ లు అంటే ఏమిటి, వాటిలో ఎలా పెట్టుబడి పెట్టాలో తెలుసుకుందాం.బంగారం ధర కొన్ని నెలలుగా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.98,840కి చేరుకుంది. దీంతో బంగారంపై పెట్టుబడి పెట్టడానికి అందరూ ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా డబ్బులు తీసుకుని బంగారాన్ని ఆభరణాల రూపంలో కొనుగోలు చేస్తాం. ఈ విధానంలో మన వద్ద భౌతికంగా బంగారం ఉంటుంది. గోల్డ్ ఈటీఎఫ్ లు అంటే డిజిటల్ రూపంలో బంగారాన్ని కొనడం. ఈ విధానంలో మన చేతిలో భౌతికంగా బంగారం ఉండదు. కానీ డిజిటల్ రూపంలో ఉంటుంది. అవసరమైనప్పుడు దాన్ని విక్రయించవచ్చు.గోల్డ్ బెంచ్ మార్క్ ట్రేటెడ్ పథకాలనే గోల్డ్ బీఈఎస్ లు (ఈటీఎఫ్ లు) అంటారు. వీటిని ట్రేడింగ్ రోజుల్లో మార్కెట్ సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంచ్ (ఎన్ఎస్ఈ), బీఎస్ఈలలో కొనుగోలు చేయవచ్చు. ఒక గోల్డ్ బీఈఎస్ యూనిట్ విలువ 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 0.01 గ్రాముల బంగారానికి సమానం. డిమెటీరియలైజ్డ్ లేదా డిజిటల్ రూపంలో ఇవి అందుబాటులో ఉంటాయి. పెట్టుబడిదారులు వీటిని కొనుగోలు చేసుకోని తమ ఖాతాలో ఉంచుకోవచ్చు. ధర పెరిగినప్పుడు, డబ్బులు అవసరమైనప్పుడు విక్రయించుకునే అవకాశం ఉంటుంది.కంపెనీ స్టాక్ ల మాదిరిగానే గోల్డ్ ఈటీఎఫ్ లను మార్కెట్ సమయంలో ట్రేడింగ్ చేయవచ్చు. దీని కోసం పెట్టుబడిదారులకు డీమ్యాట్ ఖ్షాతా అవసరం. ఒక్క బీఈఎస్ ఈటీఎఫ్ యూనిట్ ను కొనుగోలు చేసినప్పుడు, మీరు 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 0.01 గ్రాముల బంగారంలో పెట్టుబడి పెట్టినట్టు అవుతుంది. యూనిట్లు డిజిటల్ రూపంలో ఖాతాలో జమఅవుతాయి. వాటిని అమ్మకం, కొనడం చేయవచ్చు. దీని వల్ల మరో ఉపయోగం ఏమిటంటే దొంగల భయం ఉండదు. భౌతికంగా బంగారం ఇంటిలో ఉంటే



దొంగలు చోరీ చేస్తారనే భయం ఉంటుంది. గోల్డ్ ఈటీఎఫ్ లతో నిశ్చింతంగా ఉండొచ్చు. ఖాతాలోని యూనిట్లను ఎవ్వరూ దొంగిలించలేదు.గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్ ను ట్రేడింగ్ సమయంలో చాలా సులభంగా అమ్మకం, కొనడం చేయవచ్చు. వీటిలో బ్రోకరేజీ రుసుము చాలా తక్కువగా ఉంటుంది. ప్రవేశానికి రుసుం, వెళ్లేటప్పుడు చార్జీలు ఉండవు.ఇంటిలోని బంగారాన్ని బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. దాని ఏటా చార్జీలు చెల్లించాలి. డిజిటల్ రూపంలో బంగారానికి ఎలాంటి అదనపు రుసులు చెల్లించనవసరం లేదు.డీమ్యాట్ ఖాతాలో డిజిటల్ రూపంలో బంగారం యూనిట్లను దాచుకోవచ్చు. మార్కెట్ లో ధర పెరిగినప్పుడు విక్రయించుకోవచ్చు. ట్రేడింగ్ సమయంలో ఎప్పుడైనా లావాదేవీలు చేయవచ్చు. యూనిట్లను దాచుకున్నందుకు ఎలాంటి చార్జీలు ఉండవు.దుకాణంలో బంగారు ఆభరణాన్ని కొనుగోలు చేయాలంటే కనీసం రూ.పది వేలకు పైగా పెట్టుబడి పెట్టాలి. గోల్డ్ ఈటీఎఫ్ లలో సుమారు 500 నుంచి పెట్టుబడి పెట్టవచ్చు. దానికి సమాన విలువ కలిగిన బంగారాన్ని మీ ఖాతాలో జమ చేస్తారు.మరిన్ని బిజినెస్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి